క్లుప్తంగా

రాజీతోనే సత్వర పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర



సంగారెడ్డి టౌన్: రాజీమార్గంలో కేసులు త్వరగా పరిష్కరించుకోవచ్చని మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్రిమినల్ కాంపౌండ్, ఎక్సైజ్, డ్రంకెన్ డ్రైవ్, భూ తగాదాలు, బీమా వంటి కేసులను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి మంగళవార ంసన్మానించారు. 9న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో సెకండియర్ విద్యార్థి తరుణ్, పదోతరగతికి చెందిన అస్లాం విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లిక, పీఈటీ మన్సూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ క్రీడారంగాన్ని పటిష్ట పరిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తోందని ఎంపీడీఓ శశిప్రభ చెప్పారు. మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మర్వెల్లి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోవింద్‌రెడ్డి, ఎంపీఓ ఖజానాసిరొద్దీన్, హెచ్‌ఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అపోహలు వద్దు



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర మానిటరింగ్ అధికారిణి సరస్వతీ

నారాయణఖేడ్: కుష్టు వ్యాధిపట్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, దానిపట్ల అపోహలు పెట్టుకోవద్దని రాష్ట్ర కుష్టు వ్యాధి నియంత్రణ పర్యవేక్షణ అధికారిణి సరస్వతీ సూచించారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వేను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సరస్వతీ మాట్లాడుతూ ఈ వ్యాధి మైకోబ్యాక్టీరియం లెప్రే బ్యాక్టీరియాతో వ్యాపిస్తుందన్నారు. ప్రధానంగా చర్మానికి, నరాలకు సోకుతుందని, నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడు నుంచి ఐదేళ్ల కాలం పడుతుందని తెలిపారు. సరస్వతీ వెంట డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో సంధ్యారాణి, వైద్యాధికారి రాజేశ్వర్, శేఖర్‌రెడ్డి, జెట్ల భాస్కర్ ఉన్నారు.

ఏకగ్రీవంగా టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీ

నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నారాయణఖేడ్‌లో రెండు రోజులపాటు జరిగిన సంఘం జిల్లా మహాసభల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, పరిశీలకులుగా రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా కె.అశోక్, ప్రధాన కార్యదర్శిగా బి.సాయిలు తిరిగి రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎం.సువర్ణ, జె.కాశీనాథ్, కోశాధికారిగా పి.శ్రీనివాస్‌రావు, కార్యదర్శులుగా ఎం.అమరేశ్వరి, శామయ్య, సాయితేజ, అరుణ శ్రీ, ఏశప్ప, కృష్ణమూర్తి, సంయుద్దీన్, నర్సయ్య, జగన్మోహన్, నరేశ్, కృష్ణకుమారి, అనురాధ, విఠల్, సింహాచలంను ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ చేసిన పలు తీర్మానాలను ఆమోదిచింది.

పేకాట రాయుళ్ల అరెస్టు

జహీరాబాద్ టౌన్: గోవింద్‌పూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శివలింగం తెలిపారు. గ్రామ అటవీ ప్రాంతంలో పేకాడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. పది మందిని అరెస్టు చేసి రూ. 1.42 లక్షలు నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



మహబూబ్ సాగర్ చెరువు కట్టపై తేలిన కంకర



పాడైన ఓపెన్ జిమ్ పరికరాలు

ఆహ్లాదమని వస్తే అవస్థలే

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువుకట్టపై సేద తీరటానికి వచ్చిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. బెంచీల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పాములు సంచరించడంతోపాటు కొన్ని బెంచీలు పూర్తిగా విరిగిపోయాయి. ఓపెన్ జిమ్ పరికరాలు కూడా పాడయ్యాయి. దీంతో చిన్నారులు నిరుత్సాహంగా వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకట్టపై శుభ్రం చేయించాలని, జిమ్ పరికరాలు బాగు చేయించాలని పలువురు కోరుతున్నారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ప్రజల గుండెల్లో కేసీఆర్

- అరెస్టులకు భయపడేది లేదు
- ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- ఎమ్మెల్యే సునీతారెడ్డి
- హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



దౌల్తాబాద్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మాజీమంత్రి, ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యే సునీత మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానంటే సాధ్యమయ్యే పనికాదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లిని రాబోయే రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం రాగానే తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని అరెస్టులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్మిక సంక్షేమ బోర్డు మాజీ రాష్ట్ర చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ అశోక్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలం మధు

పేదల పెన్నిధి సాయన్న

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: రజాకర్లకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేదప్రజల కడుపు నింపిన పోరాట యోధుడు పండగ సాయన్న అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని చిట్కుల్‌లో ఉన్న మత్స్యభవనంలో సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

మెనూ పాటించని హాస్టళ్లపై చర్యలు

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వ హాస్టళ్లలో మెనూ ప్రకారం వంటలు వండి విద్యార్థులకు పౌష్టికాహారం అందించే భాద్యత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లదే అని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. మండల కేంద్రం కంగ్టిలోని సాంఘీక సంక్షేమ బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని అన్నీ హాస్టల్‌లతో పాటు గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వంటలతో పాటు పండ్లు, గుడ్లు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పాటు అధికారులు సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, వార్డెన్లు రామప్ప, పాండు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజా వేదిక

- రూ.2.72 లక్షల నిధులు దుర్వినియోగం
- అదనపు డీఆర్‌డీఓ బాల్‌రాజ్



ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

రాయికోడ్(అందోల్): ఉపాధి హామీ పథకంలో భాగంగా 2023-24కు సంబంధించిన పనులపై మంగళవారం మండల కేంద్రంలో ప్రజా వేదిక నిర్వహించారు. సంవత్సర కాలంలో రూ.7.54 కోట్లతో చేపట్టిన పనులపై విచారణ జరిపిన అధికారులు రూ.2.72లక్షల నిధులు దుర్వినియోగమైనట్టు గుర్తించారు. ఆ నిధులను బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయనున్నట్లు అదనపు డీఆర్‌డీఓ బాల్‌రాజ్ తెలిపారు. జాబ్ కార్డులు అప్‌డేట్ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూగుల్ మీట్ సమావేశాల్లో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు కల్పించి రైతులు, కూలీలకు ప్రయోజనం చేసేలా కృషి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శు లు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది సమష్టిగా రికార్డులను నమోదు చేయాలని చెప్పారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మెన్ నాగారం గొల్ల అంజయ్య కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, సుభాష్, ఎంపీడీఓ ఎంఎం షరీఫ్, ఎస్‌ఆర్పీ బాలునాయక్, షేపీఓ రమేశ్ కుమార్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ తల్లి' కొత్త విగ్రహంపై నిరసన



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ తల్లి విగ్రహ మార్పును వ్యతిరేకిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు జహీరాబాద్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలో నిరసన ర్యాలీ ప్రదర్శించారు. భవానీ మందిరం చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నిరసన బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టునారాయణ, నాయకులు నామ రవికిరణ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

గిరిజనుల భూముల ఆక్రమణకు కుట్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న విలువైన భూములను నేడు తప్పుడు పత్రాలతో కొంతమంది భూస్వాములు, ఆక్రమించేందుకు నిర్మాణ సంస్థలు కుట్రలు పన్నుతున్నారని వెలిమెల మాజీ సర్పంచ్ రాజ్యం మహిపాల్ గౌడ్, గిరిజన సంక్షేమ సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తండాలో ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా గిరిజన సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజనుల భూబాధితుల సమావేశంలో వారు మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా సరిహద్దు వెలిమెల తండా, రంగారెడ్డి జిల్లా సరిహద్దు అయిన కొండకల్ తండావాసుల భూములను తప్పుడు పత్రాలతో కొందరు కాజేస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల భూముల ఆక్రమణలపై కోర్టును ఆశ్రయించామన్నారు. జాతీయ ఎస్టీ కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. న్యాయవాది కృష్ణ, గిరిజన సంఘాల నాయకులు అంజయ్య నాయక్, నారయణ నాయక్ పాల్గొన్నారు.

యాప్‌లో వ్యవసాయ సమాచారం

జహీరాబాద్: రైతులకు అవసరమైన ప్రామాణికమైన శాస్త్రీయ సమాచారాన్ని కాబి (సీఏబీఐ) వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా తెలుగులో అందుబాటులోకి తెచ్చిందని కేవీకే శాస్త్రవేత్తలు, కాబి అధికారులు పేర్కొన్నారు. మంగళవారం డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్ సహకారంతో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సమస్యలను గుర్తించడం, అవసరమైనంత మేర ఎరువులు నిర్ణయించడం, చీడ పీడల నియంత్రణకు పురుగుమందులు కనుగొనడం, పురుగు మందు మోతాదు లెక్కించడం, మందులను సిఫారసు చేయడం తదితర సమాచారం అందుబాటులో ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎన్.స్నేహలత, రమేష్, కాబి అధికారులు మంజరి, కెవిన్, రైతులు పాల్గొన్నారు.

సీఎంకప్ క్రీడలు ప్రారంభం



రాయికోడ్ సీఎం కప్ పోటీలను ప్రారంభించి విద్యార్థులతో కబడ్డీ ఆడుతున్న అంజయ్య



కల్హేర్(నారాయణఖేడ్): సీఎం కప్ క్రీడా పోటీల్లో బహుమతులు అందజేస్తున్న అధికారులు



నారాయణఖేడ్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్



హత్నూరలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



మునిపల్లి(అందోల్): లింగంపల్లిలో..



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి



పోటీలను ప్రారంభించిన నియోజకవర్గ ప్రత్యేకాధికారి దేవుజ

జిల్లాల్లోని అన్ని మండలాల్లో మంగళవారం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసమని అన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

మెదక్ జిల్లా ఈఓ డాక్టర్ రాంజీ



దూడకు మందువేస్తున్న అధికారి

వట్‌పల్లి(అందోల్): గ్రామాల్లో నిర్వహించే పశు వైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఈఓ డాక్టర్ రాంజీ పిలుపునిచ్చారు. ఆందోల్ మండలంలోని కొడెకల్‌లో పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. లింగ నిర్ధారణ జరిగిన వీర్యాన్ని పాడి పశువులకు వేయిస్తే 95శాతం ఆడ దూడలు జన్మిస్తాయని సూచించారు. అనంతరం ఆయన పాడి పశువులకు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆందోల్ మండల పశువైద్యాధికారి విహారిక, గోపాలమిత్ర సూపర్ వైజర్ సి.అర్జునయ్య, వీఏ అనీషాబేగం, కేఆర్ ప్రభు, నాగరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బూచనెల్లిలో గ్రంథాలయం ప్రారంభం**

జహీరాబాద్: బూచనెల్లిలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రంథాలయం ద్వారా విద్యార్థులకు పఠనా శక్తి, నైపుణ్యం పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ బస్వరాజ్, హెచ్‌ఎం మాణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ **స్కావెంజర్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్స్ స్కావెంజర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఏఓ పరమేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీలను వెంటనే రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి స్కావెంజర్లను, స్వీపర్లను విధుల్లోకి తీసుకున్నప్పటికీ అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పజెప్పి స్కావెంజర్ల , స్వీపర్లతో చాకిరి చేయించుకుంటుందని ఆరోపించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పిల్లి శ్రీకాంత్, రాము, మంజుల, లక్ష్మి, స్వప్న, లావణ్య , విజయలక్ష్మి , లక్ష్మి, అనసూయ, సుమలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

◆ **ఈవోపై చర్య తీసుకోవాలి**

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామపంచాయతీ ఈవో అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని బీజేపీ జిల్లా నాయకులు బిట్ల మహేష్ డిమాండ్ చేశారు. కొన్నేళ్లు ఈవోగా పనిచేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడమే కాకుండా ప్రతి పనికి లంచం తీసుకుంటున్న ఈవోపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామపంచాయతీలో ఇల్లు నిర్మాణం కోసం అనుమతులు కావాలన్నా.. ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా డబ్బులు తీసుకుంటున్న ఈవోపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

◆ **వడ్డి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వడ్డి గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశు గణాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యుడు గణేష్ పశువులకు చికిత్స అందించారు. పాడి పశువుల పెంపకం, పోషణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శిబిరంలో గోపాల మిత్ర సూపర్ వైజర్ తుక్కారెడ్డి, జేవీఓ కిషన్‌రావు, గోపాల మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ**



ఝరాసంగం(జహీరాబాద్): బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సీఎస్ఆర్ నిధులతో దుప్పట్లు, యూత్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంటు ద్వారా వచ్చిన స్పోర్ట్స్ కిట్లను మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగం బీసీ సంక్షేమ వసతి గృహంలో సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, సంక్షేమాధికారి లలితకుమారి అధికారులతో కలిసి పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, వార్డెన్ శారద, తదితరులు పాల్గొన్నారు.

◆ **అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు : సాయిబాషా**

సంగారెడ్డి: అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిబాషా అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీలో రూ. 20వేలు, కర్ణాటకలో రూ.15 వేలు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారని, అదే ధనిక రాష్ట్రమైన తెలంగాణలో కేవలం 5,500 ఇవ్వడం సిగ్గుచేటన్నారు. గురుకులాల్లో ఏడాదిలోనే 48 మంది విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గౌండ్ల ప్రదీప్ గౌడ్, శ్రీవర్ధన్ గౌడ్, కసినిమని, ప్రవీణ్ , చింటూ, హరి ప్రసాద్, రోహిత్ గౌడ్, నాని, మ్యాడ్ శివ, శ్యామ్ , పవన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ **క్రైస్తవుల సంక్షేమానికి కృషి**

సంగారెడ్డి రూరల్: క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తానని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి మెథడిస్ట్ చర్చిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. టీజీఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అన్ని కులాలకు అతీతంగా ఉండే పార్టీ అని చెప్పారు. యువతి యువకులకు పరిశ్రమలలో ఉద్యోగాలు ఇచ్చే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మెథడిస్ట్ చర్చి పాస్టర్ గిడ్యోన్, యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు మధు, రూబెన్ రెడ్డి, సునీల్ కుమార్, సుధీర్‌రాజ్, నెల్సన్ రాజ్, ఇండిపెండెంట్ చర్చేస్ పాస్టర్లు పాల్గొన్నారు. అంతకుముందు యునైటెడ్ క్రిస్టియన్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు.

◆ **ఘనంగా అయ్యప్ప ఆలయ ఏడో వార్షికోత్సవం**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ వద్ద నిర్మించిన అయ్యప్పస్వామి, శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం ఏడో వార్షికోత్సవాన్ని కమిటీ సభ్యులు మంగళవారం కనులపండువగా నిర్వహించారు. స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన, అభిషేకం, కళ్యాణోత్సవం, పడిపూజ, మంత్రపుష్పం, అర్చన, పల్లకీసేవ,ఊరేగింపు,మంగళ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

